క్లుప్తంగా

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

విజయపురిసౌత్: స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు మార్చి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ లక్ష్మీరాజ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80, ఇంటర్మీడియట్ బైపీసీలో 40, ఎంపీసీలో 40 సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 23న ఉదయం 10 నుంచి 12గంటల వరకు ఐదో తరగతికి, ఇంటర్మీడియట్‌కు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం



దాచేపల్లి: స్థానిక శ్రీ సీతారామస్వామి దేవాలయ 7వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకరణ గావించారు. భక్తులు పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. గ్రామ పురవీధుల్లో పల్లకిపై ఉత్సవమూర్తులకు ఊరేగింపు నిర్వహించారు. నగర పంచాయతీ మాజీ చైర్మన్ మునగా పున్నారావు, యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, స్థానికులు కొప్పుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌మాత మహోత్సవం పతాకావిష్కరణ



విజయపురిసౌత్: స్థానిక సాగర్‌మాత దేవాలయంలో ఆదివారం మాచర్ల ఫాదర్ కొమ్మారెడ్డి రఫేలు మహోత్సవాల పతాకావిష్కరణ చేశారు. ముందుగా ఆలయంలో నవదిన జపములు, దివ్య బలిపూజా కార్యక్రమం నిర్వహించారు. మార్చి 6వ తేదీ వరకు ఈ పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఫాదర్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు, విచారణ గురువులు స్తోత్ర గీతాలతో తేరు ప్రదక్షిణ చేశారు. మార్చి 7 నుంచి 9వ తేదీ వరకు సాగర్‌మాత మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్, ఫాదర్ అన్నెం జోసఫ్ తంబి, ఫాదర్ జోసఫ్, డీకాన్ అనిల్‌కుమార్, ఆలయ పెద్దలు దుగ్గెంపూడి ఇన్నారెడ్డి, జక్కిరెడ్డి చిన్నపరెడ్డి, శౌరిరాజు, ఆలేటి మరియదాసు, శౌరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో వైద్యశిబిరం



మాచర్ల రూరల్: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంస్థ నేతృత్వంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 140 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేసినట్లు కౌన్సిల్ కార్యదర్శి రంజన, సభ్యులు సుజాత తెలిపారు. గైనకాలజిస్టు లీలా, జనరల్ ఫిజీషియన్ సుకన్య, ఆర్థోపెడీషియన్లు సుకన్య, ఆశాలత, ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య నిపుణులు పరీక్షించారు. ఎక్కువ మంది పోషక లేమితో నేత్ర, ఎముకల సమస్యలతో బాధపడుతున్నట్లు వారు గుర్తించారు. గ్రామస్తులు బండారు నాసరయ్య, ఏలే తిరుమలరావు, మల్లయ్య, రోశమ్మ, రమేష్ వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల



వెల్దుర్తి: మండాది గ్రామంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్లను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఆదివారం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందాంబ కల్యాణం కనుల పండువగా జరిగింది. భక్తులు తెల్లవారుఝాము నుంచే అధిక సంఖ్యలో పాల్గొని, మొక్కులు చెల్లించుకొని, నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పుర వీధులలో అత్యంత వైభవంగా ఊరేగించారు. దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాలలో భాగంగా మూడు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. పాట కచ్చేరీలు అలరించాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రెచ్చగొట్టే రాజకీయాలు సరికాదు



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

కారెంపూడి: మండలంలోని మిరియాల గ్రామంలో టీడీపీ వాళ్లే ట్రాక్టర్‌కు నిప్పంటించుకుని అది వైఎస్సార్ సీపీ నాయకులు చేశారని దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ షఫీ, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఈ మేరకు విలేకర్ల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవంలో పాల్గొన్నారని కానీ, ఎలాంటి ఆహ్వానం లేకపోయినా.. అశాంతి రగిల్చడానికి మిరియాల గ్రామానికి జూలకంటి బ్రహ్మారెడ్డి వచ్చారన్నారు. ఆయనను బత్తుల ఆవులయ్య తన ట్రాక్టర్‌పై ఎక్కించుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారన్నారు. పథకం ప్రకారం ట్రాక్టర్ అప్పు చెల్లించలేని స్థితిలో ఉన్న ఆవులయ్య అర్ధరాత్రి తన ట్రాక్టర్‌కు తానే నిప్పుపెట్టి.. అది వైఎస్సార్‌సీపీ వాళ్లు చేశారని ప్రచారం చేశారని ఆరోపించారు. ఇటీవల కూడా టీడీపీ నాయకుడు గోళ్ల సురేష్‌యాదవ్ మద్యం మత్తులో బైక్‌పై నుంచి పడి వైఎస్సార్‌సీపీ వాళ్లు తనపై దాడి చేశారనే ప్రచారానికి పాల్పడ్డాడని గుర్తుచేశారు. బ్రహ్మారెడ్డి టీడీపీ ఇన్‌చార్జిగా వచ్చిన దగ్గర నుంచే గ్రామాలలో గొడవలు ఎక్కువయ్యాయన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల విషయంలో పోటీపడి రాజకీయాలు చేయాలి కాని రెచ్చగొట్టి ఏదో సాధిద్దామనుకుంటే వారి ఆటలు సాగనివ్వమని స్పష్టం చేశారు. మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు అంతరగడ్డ ఏసోబు, రామదేని అంజయ్య, పాతూరి రామిరెడ్డి, కొమెర పిచ్చెయ్య, వేముల లింగయ్య, ఇరికెదిండ్ల లాజర్, మర్రి శేషయ్య, బత్తిన వెంకయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



ఎమ్మెల్యే మహేష్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

దాచేపల్లి: ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని సారంగపల్లి అగ్రహారం గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ తాగునీరు అందించేందుకు రూ.10లక్షల నిధులతో పనులు చేస్తున్నామని వైస్ ఎంపీపీ కందుల జాను ఎమ్మెల్యేకు వివరించారు.

రూ.50వేల ఆర్థిక సాయం

దారుణ హత్యకు గురైన నగర పంచాయతీ పంప్ అపరేటర్ గరికపాటి కోటేశ్వరరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.50వేల ఆర్థిక సాయమందించారు. కోటేశ్వరరావును హత్యచేసిన బంబోతుల సైదయ్య, కుమారుడు, భార్యను కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. నిందితులను కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కాసు భరోసానిచ్చారు. ఆయన వెంట ఎంపీపీ కటకం జయశ్రీ, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ చైర్మన్ షేక్ ఖాదర్‌బాషా, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, కౌన్సిలర్లు తదితరులున్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బల ప్రదర్శన



బండ లాగుతున్న ఎడ్ల జత

గురజాల: నగర పంచాయతీలోని జంగమహేశ్వరపురంలో వెంకటేశ్వరస్వామి తిరునాళ్లను పురస్కరించుకుని గ్రామ రైతు సంఘం, ఎనుముల మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ఆదివారం ఉత్సాహభరితంగా సాగాయి. జత పళ్ల విభాగం పోటీల్లో 9 జతలు ఎడ్లు పాల్గొన్నాయి. చేబ్రోలు మండలం తోటపాలేనికి చెందిన గౌతుకట్ల వెంకట క్రిష్ణయ్య యాదవ్ ఎడ్ల జత 4000 అడుగులు బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. కృష్ణా జిల్లా గన్నవరం మండలం తెంపల్లికి చెందిన జొన్నలగడ్డ దేవతాతరావు ఎడ్ల జత (3779.3) ద్వితీయ, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం గనికపూడికి చెందిన కల్లూరి ప్రవీణ్‌కుమార్ ఎడ్ల జత(3750) తృతీయ స్థానంలో నిలిచాయి. సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామానికి చెందిన నక్కా బలరామకృష్ణ, మాచవరం మండలం పిన్నెల్లికి చెందిన పిల్లి గడ్డపు రిహానా ఎడ్ల జతలు నాలుగోవ స్థానంలో నిలిచాయి.

ఆర్‌ఎంపీ సేవలను గుర్తించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సిద్దార్థ

మాచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సభ్యులను ఆదుకొని, న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.రాజా సిద్దార్థ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.రామారావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో శ్రీకృష్ణ ఆసుపత్రి వైద్యులు గుర్రం రాజశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని, మాట్లాడారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం తమకు అన్ని విధాలుగా సహకరించి, గ్రామీణ వైద్యులుగా గుర్తించాలని కోరారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటే ఆర్‌ఎంపీ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా అవగాహన సదస్సులో మాచర్ల డివిజన్ ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు మెడికల్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసరాజు, అధ్యక్షుడు డాక్టర్ శివ, జిల్లా నాయకులు సిద్దయ్యాచారి, ఆర్‌ఎంపీలు పాల్గొన్నారు.

వైభవంగా పువ్వాడమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని పువ్వాడ గ్రామంలో వేంచేసి ఉన్న పువ్వాడమ్మ తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామ దేవత పువ్వాడమ్మ తిరునాళ్లకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉపవాసం ఉన్న మహిళలు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మెక్కుబడి ప్రభలను, ఎడ్ల బండ్లను దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి సంప్రదాయాన్ని చాటుకున్నారు. గ్రామ దేవతకు పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు, గాజులు సమర్పించారు. తిరునాళ్ల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేత మక్కెన మల్లికార్జునరావు, ఆలయ ధర్మకర్తలు అప్పరాజు వెంకట నారాయణ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్లకు ఉమ్మడి గుంటూరు జిల్లానుంచే కాకుండా ఉమ్మడి ప్రకాశంజిల్లా మక్కెనవారిపాలెం, జమ్ములమడక, అద్దంకి, బీమారం గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి కాసుల గోవిందరాజులు ఆధ్వర్యంలో అమ్మవారిని పట్టువస్త్రాలతో పూలమాలలతో ప్రత్యేక అలంకారాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. భారీవిద్యుత్ ప్రభలతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఐనవోలు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల నూతన కార్యవర్గం

వినుకొండ టౌన్: ఎల్‌ఐసీ ఏజెంట్లు సమైక్యంగా పోరాడి తమ కోర్కెలు సాధించుకోవాలని జోనల్ లియాఫీ అధ్యక్షుడు మార్కండేయులు పేర్కొన్నారు. స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయంలో ఎల్‌ఐసీ ఏజెంట్ల సర్వ సభ్య సమావేశం హరనాథ్ బాబు అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఆయనతోపాటు డివిజన్ అధ్యక్షుడు రాంబాబు పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కలిసి కట్టుగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎల్‌ఐసీ ఏజెంట్ల నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించగా చెరుకూరి హరనాథ్ బాబు మరోమారు ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సెక్రటరీగా కాకుమాను కోటేశ్వరరావు, కోశాధికారిగా గోదా ఏడుకొండలు రెడ్డి, ఉపాధ్యక్షులుగా చింతా ఆదిరెడ్డి, గోలి వెంకటేశ్వరరావు, కాశ్ల విజయ్ కుమార్, జడ్డా శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మాదాల హనుమంతరావు, జాయింట్ సెక్రటరిగా పాలడుగు నాగమల్లేశ్వరరావు, డీవీ సుబ్బయ్య, రొడ్డ రాంరెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా చెరుకూరి కోటి రామమూర్తి, గౌరవ సలహాదారుగా గాలి రమణలను ఏకగ్రీవంగా తోటి సభ్యులు ఆమోదించారు. నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. జోనల్, డివిజన్ నాయకులు, ఏజెంట్స్ పాల్గొన్నారు.

28లోగా ఈ-కేవైసీ పూర్తి చేయండి

గురజాల: ఈ నెల 28వ తేదీ లోపు ఈ–కేవైసీ పూర్తి చేయాలని వ్యవసాయశాఖ పిడుగురాళ్ల ఏడీఈ శ్రీకృష్ణదేవరాయులు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. రబీ సీజన్‌లో పంటలు సాగు చేసి, నమోదు చేయించుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

నేడు వాహనాల వేలం

మాచర్ల: మాచర్ల ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో నాటు సారా, తెలంగాణ మద్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన పలు వాహనాలను సోమవారం వేలం వేయనున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటదారులు ఉదయం స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మాచర్ల: పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లా ఎదురుగా ఆదివారం రోడ్డు దాటుతున్న పెయింటర్ భాస్కర్‌రాజు అనే వ్యక్తి.. ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో అతని కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు భాస్కర్ రాజును ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని ఫిర్యాదు మేరకు, గుర్తుతెలియని వాహనం ఢీకొట్టినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంట్లో చోరీ

దుర్గి: గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చొరబడి దొంగతనానికి పాల్పడిన ఘటన ఆదివారం జరిగింది. స్థానిక సబ్ స్టేషన్ వెనకవైపు బజార్లో నివసిస్తున్న కాలువ సువర్ణకు చెందిన ఇంట్లో రూ. 5వేలు నగదు, మూడు సవర్ల బంగారం చోరీకి గురైనట్లు స్థానికులు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



విజయపురిసౌత్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన స్థానిక హరిత రిసార్ట్స్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి జలగం అంజయ్య(35) కుటుంబానికి ఏపీ టూరిజం ఉద్యోగులు ఆదివారం రూ.30వేల ఆర్థిక సాయం అందజేశారు.

సంఘం అధ్యక్షుడు పులుసు వీరారెడ్డి, నాగు, టి.శ్రీను ఆధ్వర్యంలో పర్యాటక శాఖ విజయవాడ డివిజనల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు మృతుని భార్య అంజమ్మకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ అంజయ్య కుటుంబానికి ఏపీ టూరిజం తరుపున అండగా ఉంటామన్నారు. మృతుని కుటుంబ పరిస్థితిని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో హరిత రిసార్ట్స్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

1న అభయాంజనేయ స్వామి తిరునాళ్ల

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో వేంచేసి ఉన్న సువర్చలా సమేత అభయాంజనేయ స్వామి దేవాలయ 29వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణమాచార్యులు తెలిపారు. మార్చి 1వ తేదీన నిర్వహించే వార్షికోత్సవ తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. స్వామివారి భజన కార్యక్రమంతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

1న లక్ష్మీతిరుపతమ్మ విగ్రహ ప్రతిష్ఠ

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో బీసీ కాలనీలో నూతనంగా గోపయ్య స్వామి లక్ష్మీ తిరుపతమ్మ ప్రతిష్ఠా కార్యక్రమంగా మార్చి 1వ తేదీన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా సోమవారం ఉదయం వేద పండితులు వేదమంత్రాలు, మేళతాళాల నడుమ దంపతులచే హోమాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 28న విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగింపు వైభవంగా చేస్తామన్నారు. మార్చి 1వ తేదీన ఉదయం అమ్మవారి విగ్రహాలు ప్రతిష్ఠా కార్యక్రమాలతో పాటు వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తామన్నారు.

మెడికల్ క్యాంప్‌కు అనూహ్య స్పందన



పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఆదివారం హెచ్‌ఎం లింగాల ధనలక్ష్మి శిబిరాన్ని ప్రారంభించారు. 643 మంది రోగులను పరీక్షించి, అవసరమైన వారికి అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఈసీజీ, ఎక్స్‌రే పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు చల్లగుడ్ల శ్రీనివాసరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఇమ్మానియేలు రాజు, ఉపాధ్యాయులు నరమాల హనుమంతరావు, వైద్యులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన తిరునాళ్ల



కాంతులీనుతున్న ప్రభవద్ద నాయకులు

యడ్లపాడు: కారుచోల గుత్తావారిపాలెం గ్రామల మధ్య సాగర్‌కాల్వ ఒడ్డున వేంచేసి ఉన్న విఘ్నేశ్వర స్వామి 32వ వార్షిక తిరునాళ్ల వేడుకలు ముగిశాయి. శనివారం రాత్రి అంగరంగ వైభవంగా కొనసాగిన ఈ వేడుకల్లో భాగంగా కారుచోల నుంచి గుత్తావారిపాలెం వరకు అలాగే ఆలయానికి భారీ విద్యుత్ దీపాలంకరణలు చేశారు. భక్తులను స్వాగతిస్తూ అడుగడుగున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కారుచోల–గుత్తావారిపాలెం, జాలాది, గనికపూడి గ్రామాలకు ఏకం చేస్తూ భక్తులు రాకపోకలతో రద్దీగా మారాయి. ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయం వద్ద భక్తులు బారలు తీరారు. స్వామిని దర్శించుకున్న వారందరికీ కమిటీ సభ్యులు ప్రత్యేక ప్రసాదాలు వితరణ చేశారు. అలాగే తిరునాళ్లకు కారుచోల నుంచి నాలుగు భారీ విద్యుత్ ప్రభలు, ప్రత్తిపాడు మండలం గనికపూడి గ్రామానికి చెందిన మరో విద్యుత్ ప్రభ స్వామి ఆలయం చెంత కొలువుదీరి కాంతులీనాయి. ఆలయంలో ఆధ్యాత్మిక, ప్రభల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలతో రాత్రంగా జాగారం చేశారు.

దర్శించుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు..

తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు ఆలయాన్ని సందర్శించి స్వామి ప్రత్యేకపూజలు చేశారు. పంటలు సమృద్ధిగా పండి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గ్రామాల మధ్య ఐక్యతా భావం కలుగుతుందని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైఎస్ చైర్మన్ ఎం.వీరారెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, సీనియర్ నాయకుడు విడదల గోపీనాథ్ పాల్గొన్నారు.

ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న పాస్టర్ పి.ఫిలిప్

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చర్చి ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశంలో సంఘ అధ్యక్షుడిగా పందుల సాల్మన్‌రాజు, వైస్ ప్రెసిడెంట్‌గా శిఖా ఆనందరావు, వైస్ సెక్రటరీగా కట్టెంపూడి నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా పాలెపోగు దానియేలు, సభ్యులుగా యెనుబరి వరప్రసాద్, బెజవాడ రూబెన్‌రాజు, కత్తి జాన్‌కృపాదానం, గుంటూరు అబ్రహాం లింకన్, కట్టెంపూడి మణిరాజు, పులిమెల కిరణ్ కుమార్, పచ్చిగొర్ల ప్రభాకర్, దోరడ్ల పోలయ్య, కొండ్రముట్ల పృథ్వీరాజ్, గొల్లపూడి జాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సంఘ కాపరి రెవ.పత్రా ఫిలిప్ నూతన కమిటీ సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘ పెద్దలు బేతం శ్యాంప్రసాద్, చాట్ల రామయ్య, గద్దల ప్రేమనాథ్ ప్రకాష్, గద్దల ఆశీవరప్రసాద్, జడ్పీ కో–ఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బేతం గాబ్రియేలు, వందనం, పందుల ఫిలిప్, కొడవల కాలేబురాజు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ మార్పులపై అధ్యయనం అవసరం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నరసరావుపేట ఈస్ట్: విద్యారంగంలో చోటుచేసుకుంటున్న మార్పులను ఉపాధ్యాయులు అధ్యయనం చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. నూతన విద్యావిధానం వలన జరిగే పరిణామాలను గుర్తించాలని తెలిపారు. పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం యూటీఎఫ్ పల్నాడుజిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ, విద్యారంగంలో వస్తున్న మార్పులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాదు, రాష్ట్ర నాయకులు మల్లేశ్వరరావు, ఎం.హనుమంతరావు, ఎస్.కుమారరాజా, ఎ.నాగేశ్వరరావు, ఎస్.సుందరరావు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



తమకు విద్యనేర్పిన గురువులతో పూర్వ విద్యార్థులు

మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నాదెండ్ల: మూడున్నర దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు కలుసుకోవటంతో ఆ పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 1988–89 బ్యాచ్ పదో తరగతి పూర్తి చేసుకున్న నాటి విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. 75 మంది బ్యాచ్ విద్యార్థులు ఉండగా, 53 మంది హాజరయ్యారు. విదేశాల్లో, వివిధ ప్రాంతాలు, ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన వారంతా సొంతూళ్లకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరయ్యారు. అలనాటి ఊసులను చెప్పుకుని మురిసిపోయారు. తమకు విద్య నేర్పిన గురువులు తొండెపు రాధాకృష్ణయ్య, వీరయ్య మాస్టార్లను పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. అనంతరం మృతిచెందిన గురువులు, తోటి విద్యార్థులకు సంతాపం తెలిపారు. తమ బ్యాచ్‌లో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఇరువురిని ఆర్థికంగా ఆదుకోవాలని తీర్మానించారు. భవిష్యత్తులో పాఠశాలకు కావలసిన ఫర్నీచర్‌ను సమకూర్చాలని నిర్ణయించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉదయం 9 గంటలకు ప్రారంభమైన సమ్మేళనం సాయంత్రం 5 గంటల వరకూ సాగింది. కార్యక్రమాన్ని వలేటి సుబ్బారావు, కాటస్ రహమాన్, బెల్లంకొండ శ్రీనివాసరావు, కాటా ఉష, మంజులాభార్గవి, రాజేశ్వరిలు పర్యవేక్షించారు.

గణపవరం విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసలు



విద్యార్థినికి ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న కలెక్టర్ ఎల్.శివశంకర్

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ శివశంకర్ అభినందించారు. శనివారం ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు పత్తిపాటి నాగయశ్వంత్ (10వ తరగతి) వజ్రాల కార్తిక్‌రెడ్డి (9) సీహెచ్ సాత్విక (8)లు ఇటీవల చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించి మెమెంటోలను అందించారు. మీ పాఠశాలకు త్వరలో వస్తానంటూ కలెక్టర్ వారితో చెప్పారు. పల్నాడు జిల్లాలోని జిల్లా పరిషత్, కస్తూర్బాగాంధీ, మోడల్ పాఠశాలలకు చెందిన ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులతో ప్రతి శనివారం జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ముఖాముఖి నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో ఉత్తీర్ణత శాతం, స్పోర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ తదితర అంశాలపై ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల వెంట హెచ్‌ఎం టి.సత్యనారాయణ, గణిత ఉపాధ్యాయుడు వెంకటరమణ ఉన్నారు.